నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: మయూరి నగర్ సబ్‌స్టేషన్‌లోని 11కేవీ ఫీడర్‌లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మయూరి నగర్, ఆలయ సముదాయం, ఆర్ఎల్ నగర రహదారి, వెంకట్రాయ్ నగర్, బాలాజీ నగర్, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 1, 11 నుంచి ఒంటి గంట వరకు వాటర్ ట్యాంక్ రిజర్వాయర్ రోడ్డు, కోరుకొండ పాఠశాల, వృద్ధాశ్రమ రహదారి, జీఎల్ఆర్ కాలనీ, మయూరి నగర్ భాగం ప్రాంతాలు. 11కేవీ మయూరి నగర్ ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఆర్క్ టవర్స్, మయూరి నగర్ భాగం, ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డు, వృద్ధాశ్రమం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పూజలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ రోడామేస్త్రి నగర్‌లోని మధుర మీనాక్షి అమ్మవారు, వీరభద్ర స్వామివారి బోనాల మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీస్సులతో అమ్మవారి ఆశీస్సులు పొందారు.

పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐగా సాజిత్‌పాషా

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ సీపీ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు చేపడుతున్న ఎస్‌ఐలను బదిలీ చూస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సూరారం ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకటేష్‌ను గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్‌కు, పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో పని చేస్తున్న ఎస్‌ఐ లావణ్యను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. అదే విధంగా కొత్తూరు పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ మురళీగౌడ్ సూరారం పీఎస్‌కు, కేపీహెబీ పీఎస్‌లో ఏఎస్‌ఐగా విధులు చేపడుతున్న సయ్యద్ సాజిత్‌పాషా పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు ఎస్‌ఐగా పదోన్నతిపై వచ్చారు.

వాటర్ వర్క్స్ జీఎంగా మాధవి

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌గా ఎం.మాధవి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న అశోక్ ఉద్యోగ విరమణతో డివిజన్–11లో డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న మాధవి కుత్బుల్లాపూర్ డివిజన్‌కు జీఎంగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ సిబ్బంది, డీజీఎంలు మేనేజర్లు, కాంట్రాక్టర్లు మేనేజర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



సుభాష్‌నగర్: ఎస్ఎఫ్‌సీ స్థలంలో వెలిసిన నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. గాజులరామారం రావి నారాయణరెడ్డినగర్‌ను అనుకొని సర్వే నంబర్ 307లో ఉన్న స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్థలంలో వెలిసిన నిర్మాణాలను డిప్యూటీ ఎమ్మార్వో మల్లికార్జునరావు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం నేతృత్వంలో 5 గదులు, 6 బేస్‌మెంట్లు, ఒక కాంపౌండ్ వాల్‌ను నేలమట్టం చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

బీసీ సమస్యలపై మంత్రి మండలిలో చర్చించండి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల సమస్యలు, రిజర్వేషన్లపై మంత్రి మండలిలో చర్చించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ప్రభుత్వానికి బుధవారం విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా బీసీలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా బీసీ సబ్ ప్లాన్‌ను గతంలో ప్రకటించి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని గుర్తు చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలన్నారు. ర్యాంకులతో సంబంధం లేకుండా బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గుంతల రోడ్లు.. ఇంకెన్నాళ్లు?



గుంతలమయంగా ఉన్న పేట్‌బషీరాబాద్‌లోని పెట్రోల్ బంక్ రోడ్డు

సీఎస్ఆర్ నిధుల నుంచి రోడ్డు వేస్తామని ముందుకొచ్చిన ఓ సంస్థ

- అనుమతివ్వని అధికారులు
- గుంతలతో వాహనాల మరమ్మతులు
- అధికారుల తీరుపై కాలనీవాసుల ఆగ్రహం

కుత్బుల్లాపూర్ : ఒకవైపు సీఎస్ఆర్ నిధుల నుంచి రోడ్డు వేస్తామని ముందుకు వచ్చిన సంస్థకు నో చెప్పారు హెచ్ఎండీఏ అధికారులు. ప్రభుత్వ స్థలం నుంచి ప్రజా అవసరాల కోసం రోడ్డు వేయడం తప్పు కాదు. మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు లేదని మెలిక పెట్టి పనులు నిలుపుదల చేయడంపై ఆగ్రహంతో ఉన్నారు. అసెంబ్లీలో ప్రస్తావించిన.. అధికారులతో మాట్లాడిన.. ఇదిగో అదిగో అంటూ ప్రజాప్రతినిధులకే.. చుక్కలు చూపిస్తున్న అధికారులు శాశ్వత పరిష్కారం చూపే విషయంలో మాత్రం శ్రద్ధ వహించడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న కాలనీలు

జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ రిలయన్స్ పెట్రోల్ బంక్ నుంచి అపర్ణకు వెళ్లే రోడ్డులో వైష్ణవి మిడోస్, యాదిరెడ్డి బండ, రంగారెడ్డి బండ, వుడ్స్ కాలనీ, సల్మాన్ బెల్ మోర్, వైష్ణవి కాలనీ, సౌజన్య ఎన్‌క్లేవ్, అల్వాల్ కు వెళ్లే వివిధ కాలనీల ప్రజలు ఈ ప్రాంతం నుండే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతిరోజు నాలుగు కిలో మీటర్ల మేర తిరిగి రావాల్సి వస్తుంది. ఈ రోడ్డు ఏర్పాటు విషయంపై పైన పేర్కొన్న కాలనీలతో పాటు వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారుల దష్టికి రెండు సంవత్సరాలుగా ఆయా కాలనీల ప్రజలు తీసుకెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదు.

వాహనాలు తుక్కుతుక్కు

పేట్‌బషీరాబాద్ రిలయన్స్ పెట్రోల్ పంపు నుంచి వివిధ కాలనీలకు వెళ్లే వాహనాలకు వారం రోజులకోసారి రిపేర్లు వస్తున్నాయి. షాక్ అబ్జర్వ్‌లు విరిగిపోతున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద గుంతలు ఉన్నా కనీసం అధికారులు రోడ్డు విషయంపై చర్యలు తీసుకోవడం లేదు. సుమారు 20కి పైగా కాలనీలో ఉన్న ఈ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయ్‌చాందిని నుంచి సల్మాన్ బిల్మార్ సిమెంట్ రోడ్డు వరకు ఒక రోడ్డు, పెట్రోల్ పంపు నుంచి మరొక రోడ్డు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం ఉండదు. ఒకవైపు జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు జరుగుతున్న నేపథ్యంలో అడ్డదిడ్డంగా వాహన రాకపోకలు జరుగుతున్నాయి. గతంలో రంగారెడ్డిబండ నుంచి బీటీ రోడ్డు ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ అధికారులు రూ.42 లక్షలతో ప్రణాళికలు రూపొందించి చేతులెత్తేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

అసెంబ్లీలో బీఆర్ఎస్ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద తన గళం విప్పి రోడ్డు ఏర్పాటు చేయాలని, అనేక కాలనీలు ఇబ్బందులు పడుతున్నాయని మాట్లాడారు. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది.

మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు లేదని..

హెచ్ఎండీఏ అధికారులు మాస్టర్ ప్లాన్‌లో రోడ్డు లేదని మెలిక పెట్టి సీఎస్ఆర్ నిధులతో చేపట్టే రోడ్డు పనులకు బ్రేక్ వేశారు. కోర్టు వివాదం లో ఉందని కొన్ని రోజులు ప్రచారం చేసిన అధికారులు.. తర్వాత అక్కడ రోడ్డు వేయడం కుదరదు అంటూ చేతులెత్తేయడంతో ఎంపీ ఈటల రాజేందర్‌ను వివిధ కాలనీల ప్రజలు కలిసి సమస్యను వివరించారు. ఈ నేపథ్యంలో హెచ్ఎండీఏ కమిషనర్, జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. ఇక్కడ రోడ్డు నిర్మాణం విషయంపై జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో వ్యవహరిస్తే తప్పకుండా ఫలితం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్ఓసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ భవానీనగర్‌కు చెందిన నర్సమ్మ(50), చింతల్ ద్వారకానగర్‌కు చెందిన ఆంజనేయులు(62), కొంపల్లి మున్సిపల్‌కు చెందిన శ్వేత(21) లు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆదుకోవాలని ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీంతో స్పందించిన ఆయన రూ.6.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు చేయించారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సదరు ఎల్ఓసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎదురుచూసేవారు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, గోపాల కృష్ణ, ప్రతాప్‌రెడ్డి, వై.పాండు, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్, సీఐ విజయవర్ధన్

సీసీ కెమెరాలతో మరింత భద్రత

కుత్బుల్లాపూర్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత మరింత పటిష్టమవుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్ కాలనీలో రూ.4లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను బుధవారం ఆయన పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఎస్ఎన్‌డీపీ నిధులతో గోదావరి హోమ్స్‌లోని మురుగు నీరు ప్రవాహ సమస్యను పరిష్కరించామని, కాలనీలోని పార్కు, సీసీ రోడ్డు పనులను చేపట్టి కాలనీని మోడల్ కాలనీగా అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు తిరుమల్ రావు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కోశాధికారి కె.రామా చారి, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశం, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధి రాములు, సుధాకర్ గౌడ్, సమ్మయ్య నేత, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజులు స్పెషల్ డ్రైవ్

నిజాంపేట్: 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' అనే నినాదంతో జూన్ 2వ తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు వంద రోజుల పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ సిబ్బంది పలు వార్డులలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. స్టోమ్ వాటర్ డ్రెయిన్, నలాస్ డిసిల్టేషన్ కార్యక్రమం, అనిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ఎస్‌హెచ్‌జీ ఉమెన్స్, ఎన్‌జీఓస్, ఆర్‌డబ్ల్యూఏఎస్, సిటిజన్స్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘనంగా మధుర మీనాక్షి బోనాలు



అమ్మవారిని దర్శించుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి

చింతల్: రోడమేస్త్రినగర్‌లోని మధుర మీనాక్షి ఆలయ బోనాల ఉత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్ నగర్‌లో బుధవారం మరియమ్మ ఆలయంలో బోనాల మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పూజలు చేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి



నాగరాజు(ఫైల్)

కుత్బుల్లాపూర్: చేపలను పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి ప్రాంతానికి చెందిన చంచల నాగరాజు(48) చేపలను పడుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం నాగరాజుతో పాటు అదే ప్రాంతానికి చెందిన బండారు దేవేందర్, రాజులు స్థానికంగా ఉన్న సోకాయికుంట చెరువులో చేపలు పట్టేందుకు చెరువులోకి దిగారు. రాత్రి వేసిన వలలు తొలగించే క్రమంలో నాగరాజు నీటి మునిగిపోయాడు. వెంటనే అతడిని చెరువులో నుంచి బయటకు తీయగా.. అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోవడం వల్ల కాలనీలలో చిన్నచిన్న సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బుధవారం ఐదోవార్డులో ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమకు కనీస అవసరాలు అయిన చెత్త సేకరణ, నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, భూగర్భ డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం తదితర సమస్యలపై బోర్డు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని వివరించారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులను కాలనీకి పిలిపించి వారి సమస్యలను వివరించి త్వరగా వీటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

◆ అనంతరం కాలనీ వాసులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ... బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడం వలన ఇలాంటి చిన్న చిన్న పనులను కూడా ఎమ్మెల్యే పట్టించుకోవాల్సి వస్తుందన్నారు. అదే బోర్డు ఎన్నికలు నిర్వహించినట్లయితే ప్రతి వార్డుకు ఒక ప్రజాప్రతినిధి ఉంటారని, వారు ఆయా సమస్యలను బోర్డు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. గతంలో ఇక్కడ వార్డు సభ్యులుగా, నామినేటెడ్ సభ్యులుగా పని చేసిన వారు పదవులపై ఉన్న శ్రద్ధను ప్రజలకు సేవ చేయడంలో చూపించలేదన్నారు. సకాలంలో బోర్డు ఎన్నికలు నిర్వహించినట్లయితే సమర్థులకు, నిత్యం అందుబాటులో ఉండే వారికి ఓట్లు వేసి గెలిపించుకోవాలని కాలనీ వాసులకు సూచించారు.

ప్రజలను ఏనాడూ ఇబ్బంది పెట్టలేదు

- రాక్షసుల్లా పీడించే కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బీఆర్ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు సర్దార్ కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని తీరు ఉందని విమర్శించారు. కట్టుకున్న చిన్న ఇల్లును కూడా కూల్చేసి నానా రకాలుగా వేధించడం వల్ల తట్టుకోలేక అతను ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. రాక్షసుల్లా పీడించే కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పే రోజు త్వరలో ఉందన్నారు. దయచేసి ఎవరూ కూడా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని, ధైర్యంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గౌసుద్దీన్, సత్యం, ఐలయ్య, వీరారెడ్డి, అబ్దుల్ రహీమ్, నూర్, అమీద్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



ఇద్దరు డ్రైవర్ల దొంగతనాల తీరును వివరిస్తున్న జీఆర్‌పీ డీఎస్పీ జావెద్

సికింద్రాబాద్: దొంగతనాలు చేస్తూ తద్వారా వచ్చే డబ్బు ద్వారా విలాసాలు చేస్తున్న నేరగాళ్లయిన ఇద్దరు మిత్రులను రైల్వే పోలీసులు అదుపులోనికి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయిశ్వర్‌గౌడ్ వివరాల ప్రకారం.... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అనిశెట్టిపల్లికి చెందిన తంబళ్ల నితిన్ (27), నిజామాబాద్‌కు చెందిన ఇందిరాల రాజేశ్ (35) అనే ఇరువురు మిత్రులు. వేర్వేరు కేసుల్లో పాత నేరస్తులు అయిన ఇరువురిలో ఒకరు ఆటో డ్రైవర్ కాగా మరొకరు ఆటోడ్రైవర్. ఇరువురికి జూదం, మద్యం, ఆన్‌లైన్‌గేమ్స్, బెట్టింగ్ తదితర వ్యసనాలు ఉన్నాయి. వ్యసనాలను తీర్చుకోవడంతో పాటు విలాసవంతమైన జీవితం గడపడం కోసం డ్రైవింగ్ వృత్తి ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో దొంగతనాలు చేయడం వృత్తిగా ఎంచుకున్నారు. ఈనెల 4 న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ 1వ నెంబర్ ప్లాట్‌షామ్‌పై జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నితిన్, రాజేశ్‌లు 2వ నెంబర్ గేట్ వద్ద అనుమాస్పద పరిస్థితుల్లో పట్టుబడ్డారు. పోలీసుల విచారణలో ఇరువురు నిందితులు తాము చేసిన నేరాలను అంగీకరించారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇరువురు వేర్వేరుగా, కలిసి మొత్తంగా 39 నేరాలకు పాల్పడినట్టు అంగీకరించారు. లోగడ చేసిన నేరాల్లో పట్టుబడ్డ ఇరువురు నిందితులు పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఇరువురు నిందితుల నుంచి రూ. 11.46 లక్షల విలువ చేసే 114.6 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను పట్టుకుని చోరీ సొమ్ము రికవరీ చేయడంలో దర్యాప్తు చేసిన ఎస్‌ఐలు ఎంఏ మాజిద్, డి.రమేశ్‌లను డీఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

సమస్యలను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్: నూతన చట్టం భూ భారతిపై రైతులకు అవగాహన కల్పించి వారి సమస్యలను తెలుసుకోవడానికి నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి సోమారంలో బుధవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన సూచనలు చేశారు. రైతుల సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారం కోసం అధికారులు అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. సదస్సుల నిర్వహణ వల్ల రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సునీల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

చెత్తను తరలించక.. వాహనాలు కదలక!


నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ప్రతి రోజు సుమారు 120 టన్నులకు వరకు చెత్తను కార్పొరేషన్‌లోని పలు కాలనీలు, బస్తీల నుంచి సేకరించి డబుల్ బెడ్ రూం సముదాయంలో గల డంపింగ్ యార్డులో వేస్తున్నారు. కానీ ఇక్కడి నుంచి తరలించాల్సిన చెత్తను మాత్రం తరలించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లోనికి ఆటోలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో రోడ్లపైనే నిలుస్తున్నాయి. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది.



చెత్త ఆటోల మధ్య ఇరుక్కుపోయిన వాహనాలు

- డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త
- చెత్త ఆటోలు లోనికి వెళ్లడానికి వీలు లేని వైనం
- రోడ్డుపై చెత్త ఆటోలతో ట్రాఫిక్ జాం
- పట్టించుకోని అధికారులు

నిజాంపేట్: నిజాంపేట్ నుంచి జవహర్‌నగర్‌కు చెత్తను తరలించేందుకు అధికారులు కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. డంపింగ్ యార్డులో ప్రతి రోజు చెత్త వేసేందుకు ట్రాక్టర్లు, సుమారు 200 వరకు ఆటోలు డంపింగ్ కేంద్రానికి వస్తుంటాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ ప్రక్రియ ప్రతి రోజు కొనసాగుతుంది. డంపింగ్ యార్డు నిజాంపేట్ నుంచి ఇటు ప్రగతినగర్ వైపుకు, మరో వైపు గండిమైసమ్మ రోడ్డు వైపు కలుస్తుంది. దీంతో ప్రతి రోజు ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉంటుంది. దీనికి తోడు చెత్త ఆటోలు రోడ్డు రెండు వైపుల నిలిచిపోవడంతో తీవ్రంగా ట్రాఫిక్ జాంతో రాకపోకలు సాగించే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డంపింగ్ యార్డు నుంచి తరలించాల్సిన చెత్తను సకాలంలో తరలించకపోవడంతో గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకుపోవడంతో డంపింగ్ యార్డులో చెత్తను వేసే పరిస్థితి లేదు. యార్డులోకి చెత్త ఆటోలను అధికారులు అనుమతించకపోవడంతో రోడ్డుపైనే డ్రైవర్లు తమ ఆటోలను నిలిపివేయడంతో ప్రతి రోజు ట్రాఫిక్ జాం అవుతుంది. అంతేకాకుండా లోపల వేసిన చెత్తను సకాలంలో ఓ క్రమ పద్ధతిలో జేసీబీలతో పక్కకు వేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. చెత్తను తీసుకువచ్చిన డ్రైవర్లు సైతం చెత్త ఆటోలతో గంటల తరబడి ప్రతి రోజు రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.



చెత్త వేసేందుకు డంపింగ్ యార్డు వద్ద వేచియున్న ఆటోలు


చెత్త తరలింపుపై చిత్తశుద్ధి ఏది?

ప్రతి రోజు సుమారు 120 టన్నుల చెత్తను తరలింపుపై అధికారులకు చిత్త శుద్ధి లేకపోవడం వల్లే సమస్య తీవ్రమవుతుందని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుట్టలుగా చెత్త పేరుకుపోవడంతో పక్కనే ఉన్న డబుల్ బెడ్ రూం వాసులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదే విధంగా వర్షాకాలం ప్రారంభమవడంతో సీజనల్ వ్యాధులు సైతం ప్రబలే ప్రమాదం ఉంది.

ట్రాఫిక్‌ను నియంత్రించే వారే కరువు

ప్రతి రోజు ట్రాఫిక్ జాం అవుతుండటంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కనిపించరు. అసలు ఈ సమస్య ఉందని సైతం గుర్తించకపోవడం విశేషం. కనీసం సమస్య పరిష్కరించే వరకైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ట్రాఫిక్ పోలీసులు సహాయం తీసుకుని ట్రాఫిక్‌నైనా నియంత్రించేందుకు ప్రయత్నించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చెత్తను తొలగిస్తాం



చెత్తను జవహర్‌నగర్‌కు ప్రతి రోజు తరలించాల్సిన కాంట్రాక్టర్ టెండర్ గడువు కాలం ముగిసింది. కాబట్టి కొంత ఇబ్బంది అయ్యింది. ప్రస్తుతం కొత్త వారికి కాంట్రాక్ట్ ఇచ్చాం. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. అక్కడ ఎలాంటి చెత్త లేకుండా చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– సాబేర్ అలీ, మున్సిపల్ కమిషనర్.